www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం మే 26 2024
5
చిత్తూరు



పులివర్తి నానిపై దాడి చేయలేదు : చెవిరెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (తిరుపతి రూరల్)



సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున, అనంతరం చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన దాడులలో చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై దాడిచేయలేదని, అతని కారును ధ్వంసం చేశారని మాజీ వైసిపి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం తుమ్మలగుంటలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో చెవిరెడ్డి మాట్లాడుతూ పోలింగ్ రోజు రాత్రి కూచివారిపల్లి, రామరెడ్డిపల్లి గ్రామాల్లో తన కుమారునిపై దాడిచేసి, వాహనాన్ని దగ్ధం చేసినప్పటికీ తన కార్యకర్తలు సంయమనం పాటించమని చెప్పానన్నారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

పాఠకులకు గమనిక

సాంకేతిక కారణాల వల్ల ఆదివారం 'స్నేహ' పుస్తకాన్ని అందించలేక పోతున్నాం. సోమవారం పత్రికతో పాటు అందించే ఏర్పాటు చేస్తాం.

\- మేనేజర్

గెలుపు మాదే..?

ఎవ్వరి ధీమా వారిదే..!

- పెరిగిన పోలింగ్ శాతంపై
- అధికార, ప్రతిపక్షాల వాదనలు
- 4న తేలనున్న భవితవ్యం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

మునపెన్నడూ లేనివిధంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని నియోజకవర్గల్లో పోలింగ శాతం పెరిగింది. చిత్తూరు నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా 81.24 శాతం పోలింగ్ నమోదైయింది. ఈ నియోజవర్గంలోని 226 పోలింగ్ కేంద్రాల్లో భారీగా ఓట్లు శాతం నమోదు కాగా పురుషులతో పోల్చితే మహిళా ఓట్లు అధికం.

చిత్తూరు నియోజవర్గంలో 2,02,850 మంది ఓటర్లు కాగా 1,64,771 ఓట్ల పోలైయ్యాయి. ఇందులో పురుషుల ఓట్లు 80,493, మహిళా ఓట్లు 84,278 ఉన్నాయి. కౌటింగ్ సమయం దగ్గర పడుతున్నకొద్ది అధికార, ప్రతిపక్షలు గెలుపు మాదంటే.. మాదే అనే ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పెరిగిన పోలింగ్‌శాతం అధికార పార్టీకి వ్యతిరేకమంటూ ప్రతిపక్ష తెలుగుదేశం వాదిస్తుంటే... మరోమారు వైసిపికి అధికార పగ్గాలు అప్పగించేలా ఓటర్లు ఆసక్తి చూపారంటోంది అధికార పార్టీ.. మరోవైపు చిత్తూరు టిడిపి ఎంపి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎంఎల్‌ఏ అభ్యర్థి గురజాల జన్మోహన్ విజయం కోసం తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు సినీనటుడు బాలకృష్ణ చిత్తూరులో నిర్వహించిన బహిరంగసభల్లో పాల్గొన్నారు. వైసిపి అభ్యర్థి ఎంసి విజయనందరెడ్డి విజయం కోసం వైసిపి ముఖ్యనాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రోడ్‌షోలో పాల్గొన్నారు.

అందరి చూపూ.. చిత్తూరు వైపే..

గతంలో ఎన్నడూ లేనివిధంగా చిత్తూరు నియోజకవర్గంలో అధికార, పతిపక్ష పార్టీల మధ్య ఎన్నికల వార్ నడిచింది. పోలింగ్ రోజువరకు ఇరు పార్టీల చెందిన అభ్యర్థులు నువ్వా.. నేనా.. అనేలా ఎన్నికల ప్రచారాన్ని సాగించారు. ఓటర్లను ఆకట్టుకొనే విషయంలోనూ ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎందులోనూ తగ్గలేదు. ఓటుకు రూ.2 నుంచి 3వేల వరకు పంపిణీ చేశారు. పోలింగ్ రోజున గుడిపాల మండలంలో కత్తిపోట్లు చోటు చేసుకోక చిత్తూరు అర్బన్ పరిధిలో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు బాహాబాహీగా తలపడ్డారు. పోలింగ్ ముగిసింది. రెండునెలల పాటు ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు నానాతంటాలు పడ్డ నేతలంతా కాస్తా నెమ్మతించి సేదతీరుతున్నారు. కౌటింగ్ సమయం మరో 10రోజులే కావడంతో ముఖ్యనేతలంగా నియోజవర్గంలో మకాం వేసి అనుచరులతో కౌటింగ్ రోజున చేపట్టాల్సిన వ్యూహరచన చేస్తున్నారు.

పోలింగ్ గణాంకాలను చూస్తే..

చిత్తూరు నియోజకవర్గంలో 81.24 శాతం పోలింగ్ నమోదైంది. చిత్తూరు నగరం 77.76, చిత్తూరు రూరల్ మండలం 90.38, గుడిపాల 89.04 శాతం పోలింగ్ నమోదైంది. చిత్తూరు రూరల్, గుడిపాల మండలంలో పోలైన ఓట్లు 53,368 చిత్తూరు నగరంలోని 50డివిజన్లలో 1,11,420 ఓట్లు పోలైయ్యాయి. చిత్తూరు రూరల్, గుడిపాలతో పొల్చితే నగర ఓట్లు అధికం.. నగర ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపారనే విషయం తేలాంటే వచ్చేనెల 4వ తేదీ కౌటింగ్ వరకు ఆగాల్సిందే.

మహిళా ఓట్లే అధికం..

చిత్తూరు నగరంలో పురుషుల కన్నా అధికంగా 3,011 మంది మహిళా ఓట్లు అధికంగా పోలైయ్యాయి. చిత్తూరు రూరల్‌లో 236, గుడిపాల మండలంలో పురుషుల కన్నా అధికంగా 538 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభ్యర్థుల విజయంలో మహిళా ఓట్లు కీలకం కానున్నాయి. మహిళా ఓటర్లు ఎవ్వరి వైపు మొగ్గుచూపితే వారిదే విజయమన్నట్లు చర్చ సాగుతోంది.

మా దగ్గరే కొనాలి..!



- పుస్తకాలు, నోట్స్‌లపై 'ప్రైవేటు' హుకుం
- యూనిఫాం,బెల్ట్, బ్యాడ్జీలపైనా ఆదేశాలు
- వేలకువేలు దోచుకుంటున్నా నోరుమెదపని విద్యాశాఖ

ఓ ప్రైవేట్ స్కూల్లో స్టేషనరీ ధరలు ఇలా..

యూనిఫాం (ఒక జత)	రూ.1500 - 3000
బెల్ట్	రూ.150 - 200
టై	రూ.100 -150
బ్యాగు	రూ.700 -1500
లంచ్‌బాక్స్	రూ.200 - 450
షూస్	రూ.500 -1250
టెక్ట్స్, నోట్ బుక్స్	రూ.3000 - 10000

ప్రజాశక్తి- తిరుపతి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. గుర్తింపు పొందిన పాఠశాలల్లోనూ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్యను బట్టి ఎంఈవో కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. ఇక నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ పాఠ్యపుస్తకాలకు, నోటు పుస్తకాలకు గంపగుత్తగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల విద్యార్థుల తల్లిదండ్రులను నగదు వసూలు చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు ధరలను వసూలు చేస్తున్నా, విద్యాశాఖ అధికారులు మాత్రం నోరుమెదపకపోవడంలో ఆంతర్యమేంటని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. అలాగే నిబంధలకు విరుద్ధంగా యూనిపాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూలను తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తుండటం గమనార్హం.

తమ పిల్లల భవిష్యత్ బాగుండాలన్న ఒకేఒక్క తల్లిదండ్రుల కోరిక కార్పొరేట్ పాఠశాలలకు కల్పతరువుగా మారుతోంది. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నారు. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్ , స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాదిరూపాయలు వసూలు చేస్తున్న యాజమన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ అంటూ అందినకాడికి దోచుకుంటున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 1080 హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో 559 ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. మిగిలినవన్నీ ప్రైవేటు యాజమాన్యాల అధీనంలో ఉన్నాయి. వీటిలో పూర్తిస్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు. మౌలిక వసతుల లేమి.., విద్యార్థులకు సరిపడా ఆటస్థలాల కొరత, తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం ఆ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా.. ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడి అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా.. గరిష్ఠంగా రూ.1500 మించి ఉండదు. అన్ని కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రైవేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కేజీ, యుకేజీ తరగతులకే రూ.3 వేలు వసూలు చేస్తుండగా, పెద్ద తరగతులకు రూ.8 వేలు నుంచి రూ 10 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు.

వారు అడిగినంతా ఇవ్వక తప్పదు

: కుంట్రపాకం శిల్ప, తిరుపతి

'నాకు ఇద్దరు పిల్లలు. మా అక్కకూ ఇద్దరు. మా పిన్నికి ఒకరు. మొత్తం మా ఇంట్లోనే ఐదుగురు పిల్లలున్నారు. ఇద్దరు పిల్లలు ఎల్‌కేజీ, యూకేజీ చదువుతున్నారు. ఒకరు మూడో తరగతి, మరొకరు రెండవ తరగతి చదువుతున్నారు. ఇంకొకరు 9 వతరగతి. వీరంతా భవానినగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు. ఒక్కొక్కరికి సగటున స్టేషనరీ ఫీజులే దాదాపుగా 13వేలు అవుతోంది. బహిరంగ మార్కెట్లో లభించే ధరతో పోలిస్తే ఇక్కడ మూడు రెట్లు ఎక్కువే. అయినా తప్పదు.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో ఏపీ డిప్యూటీ సీఎం బోడి ముత్యాలనాయుడు, ఏపీ మంత్రి మెరుగు నాగార్జున, ఎమ్మెల్యేలు బ్రిజేంద్రనాథ్ రెడ్డి, అప్పలనాయుడు, ఎమ్మెల్సీ వంశీకష్ణ యాదవ్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసులు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా...ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ



తిరుమలలో భక్తుల రద్దీ శనివారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూలైన్లు కొనసాగుతున్నాయి. వేసవి సెలవులతో పాటు వారాంతపు రద్దీతో దేశం నలుమూలల నుండి తిరుమలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. గత 10 రోజుల్లో శ్రీవారి మెట్టు, అలిపిరి నడక మార్గాల్లో దాదాపు 2.60 లక్షల మంది భక్తులు తిరుమలకు చేరుకొని శ్రీవారిని దర్శించుకున్నారు. మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, తాగు నీరు అందించేందుకు టీటీడీ విస్తతమైన ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం అక్టోపస్ భవనం నుండి శిలాతోరణం వరకు ప్రత్యేకంగా 8 బస్సులు ఏర్పాటు చేసి ప్రతి నిమిషానికి భక్తులను చేరవేసేలా చర్యలు తీసుకున్నారు.

మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలోనే మధ్యాహ్నానికి దాదాపు 60 వేల మందికి పైగా అన్న ప్రసాదం అందించగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలైన్లలో 50 వేల మందికి అన్నప్రసాదాలు (ఇందులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు. సాధారణం కంటే రెట్టింపుగా అన్న ప్రసాదాలు అందించారు. అంతే కాకుండా పిల్లలకు పాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు.క్యూ లైన్లలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు.శనివారం సాయంత్రం 5 గంటల వరకు 46,486 మంది యాత్రికులు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో విఐపి బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఇంజినీరింగ్, ఆరోగ్యం, అన్నప్రసాదం, విజిలెన్స్, వైద్య శాఖల ఉన్నతాధికారులు భక్తుల సౌకర్యాలను, క్యూ లైన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

నిద్రపట్టని కాంట్రాక్టర్లు..

ఆగిన రూ.60కోట్ల బిల్లులు

'ఆరణి' లేఖ ఎఫెక్ట్



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

జూన్ 4 కౌంటింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది.. అయితే కాంట్రాక్టర్లకు మాత్రం నిద్ర పట్టడం లేదు.. రాష్ట్రంలో అధికారంలోకి ఎవరొస్తారు..? తిరుపతిలో ఎవరు గెలుస్తారు? అనే టెన్షన్ వారికి నిద్ర రానీయడం లేదు. దాదాపు 60 కోట్ల రూపాయల బిల్లులు కాంట్రాక్టర్లకు రావాల్సి ఉంది. ఇప్పటికే జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఎన్నికల సమయంలో కార్పొరేషన్ కాంట్రాక్టర్ల బిల్లులను ఎటువంటి పరిస్థితుల్లో చెల్లించవద్దని కమిషనర్ అదితిసింగ్‌కు లేఖ రాశారు. కాదని ముందుకెళితే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు. దీంతో వైసిపి హయాంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లుల పరిస్థితి ఎలా ఉంటుందోనని కాంట్రాక్టర్లలో గుబులు నెలకొంది. ఆరణి శ్రీనివాసులు సైతం గతంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్ అయి ఉండి, ఇలా చేయడం సబబు కాదని మున్సిపల్ కాంట్రాక్టర్లు వాపోతున్నారు. సాటి కాంట్రాక్టర్ల సమస్య ఆరణికి పట్టలేదన్నది వారి ఆవేదన.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏడాదిగా కార్పొరేషన్ అధికారులు కాంట్రాక్టర్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో ఇక్కడ ఉన్న కమిషనర్ హరిత, ఇతర అధికారులు బదిలీ కావడంతో పనులు పూర్తయినా వీరికి బిల్లులు సకాలంలో ఇవ్వలేదు. అప్పులు చేసి వడ్డీలు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల జాప్యంతో ఇబ్బందులు పడుతున్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో మున్సిపల్ ఖజానా ఖాళీ అయ్యింది. కాంట్రాక్టర్లు ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి మరీ అభివృద్ధి పనులకు వెచ్చించారు. బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ప్రతిరోజూ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పిల్లల పెళ్లిళ్లకు, ఆస్పత్రులకు సైతం కొంతమంది కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడ్డారు. కొంతమంది దిగులుతో అనారోగ్యం పాలయ్యారు. ఈ నేపథ్యంలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కమిషనర్‌కు లేఖ రాయడంతో అదితిసింగ్ సైతం బిల్లుల చెల్లింపుకు సాహసం చేయలేకపోయారని తెలుస్తోంది. కొంతమంది బడా కాంట్రాక్టర్లకు ఎంతోకొంత బిల్లులు ఇచ్చారని తెలుస్తోంది. చిన్నాచితక అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టిన కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు అందక మల్లగుల్లాలు పడుతున్నారు. శనివారం కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్‌ను కలిసి తమకు బిల్లులు చెల్లించాలని మొరపెట్టుకున్నారు. అవకాశాలను పరిశీలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



కల్లూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, సోమల : జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు శనివారం జిల్లాలోని సదుం, కల్లూరు, సోమల పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీలు చేశారు. జూన్ 4వ తేదీన జరగున్న కౌంటింగ్‌ను దష్టిలో ఉంచుకొని సమస్యాత్మక గ్రామాలపై దష్టి సారించాలని, ప్రతిరోజూ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి ఏవైనా అక్రమంగా దాచివుంచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, బాణాసంచా, మాదక ద్రవ్యాలు, సరైన పత్రాలు లేని అనుమానిత వాహనాలను సీజ్ చేయాలని తెలిపారు. పోలీసుస్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్ మరియు వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు స్టేషన్ల పరిధులు, భౌగోళిక స్థితిగతులు, సమస్యాత్మక గ్రామాల వివరాలు, తాజా పరిస్థితులు, తదితర వివరాలను తెలుసుకున్న ఎస్పీ పోలింగ్ రోజు నమోదు చేసిన కేసుల వివరాలు, వాటి పురోగతి గురించి ఆరా తీశారు. ప్రతిరోజు గ్రామాలను సందర్శించి ప్రజలను ఇతర సమయాలలో నమోదు చేసే కేసులు కన్నా, ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసుల తీవ్రత గురించి వివరించాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా ఎలాంటి అలసత్వం లేకుండా ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, అక్రమ రవాణాను అరికట్టుటకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లను వెంటనే బైండోవర్ చేసి, వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అవసరమైన గ్రామాలలో పికెట్ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సురక్షిత నీరు, తాజా ఆహారం ఆరోగ్యకరం

డిఎం అండ్ హెచ్ఒ ప్రభావతిదేవి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి కలుషిత నీరు, ఆహారం వల్ల వచ్చే విరోచనాల నిర్మూలనపై వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతికూల వాతావరణం, రుతుపవనాల దశ్యా మనిషికి వ్యాధులులేని జీవితం సాధ్యపడాలంటే సురక్షితమైన నీరు, తాజా ఆహారంతోనే సాధ్యమన్నారు. ప్రతికూల వాతావరణ మార్పు దశ్యా, వర్షాలకు నీటి కలుషితం వల్ల నీళ్ల విరేచనాలు, కలరా, టైఫాయిడ్, పచ్చకామెర్లు, జిగత విరేచనాలు, పోలియో మొదలగు అంటువ్యాధులు చుట్టుముట్టే అవకాశం ఉందని తెలిపారు. కావున వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే తాగానీటిని కాచి వడగట్టి చల్లార్చి తాగాలని, శాస్త్రీయపద్ధతిలో క్లోరినేషన్ విధానంలో శుద్ధి చేసిన నీటిని తాగాలని, తాజా ఆహారం తినాలని సూచించారు. భోజనం తినే ప్రతిసారి సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వ్యక్తగత శుభ్రత పాటించాలని తెలిపారు. ప్రతి పిహెచ్‌సిలో 24/7 ఎపిడమిక్ సెల్ ఏర్పాటు చేసుకొని రాపిడ్ రెస్పాన్స్ టీం అందుబాటులో ఉండాలనీ, ఎమర్జెన్సీ కిట్ మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఒ ప్రభావతి దేవి

జాతరో..జాతర..

ప్రజా దృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి జిల్లాకు ప్రత్యేకంగా గడిచిన 15 రోజుల్లో రెండు జాతర్లు వచ్చాయి. ఒకటి ఎన్నికల జాతర కాగా, మరొకటి తాతయ్యగుంట గంగమ్మ జాతర. ఒకటి నెల రోజుల పాటు ఊరు..వాడా మార్మోగగా, మరొకటి వారం రోజుల పాటు వీధి వీధిన పూజలతో సాగింది. ఒకటి రంగులతో వివిద రకాల వేషధారణలతో వాడ వాడల తిరుగుతూ మొక్కులు తీర్చుకోగా, మరొకటి రాజకీయ రంగులు మార్చుతూ ప్రజలను మెప్పించేందుకు రకరకాల వేషాలు వేయాల్సి వచ్చింది. ఒక జాతర చెడుపై మంచి గెలుపుకు సాక్ష్యం కాగా, మరో జాతర బూర్జువా రాజకీయ మేథావుల పెత్తనానికి గెలుపే మార్గంగా నిలవడం గమనార్హం.

తిరుపతి ఆధ్యాత్మికమే కాదు, టూరిజానికి నెలవు. అంతేకాదు విద్యా, వైద్య హబ్‌గా ప్రసిద్ధికెక్కింది. దాదాపు 70 కిలోమీటర్ల మేర సాగరతీరం గల జిల్లా. విదేశీ పక్షులకు ఆవాసంగా నిలుస్తోంది. కొండలు, గుట్టలు, జలపాతాలతో ప్రకృతి అందాలన్నీ పునికిపుచ్చుకుంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ జిల్లాలో తాతయ్యగుంట గంగమ్మ జాతర అతిపెద్ద వేడుకల్లో ఒకటి. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తర్వాత అతిపెద్ద ఉత్సవం. వారం రోజుల పాటు జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. తిరుపతి గంగమ్మకు పుట్టిన ఊరైన తిరుపతి రూరల్‌లోని అవిలాల ఊరులో జాతర నెలలో వచ్చే రెండో మంగళవారం జాతర చాటింపు చేపడతారు. ఎన్నికల నిర్వహణలో తలమునకలైన అధికార యంత్రాంగం, తాము బందోబస్తు కల్పించలేమని చేతులెత్తేయడంతో జాతరను వాయిదా వేశారు. ఈ నెల 13న ఎన్నికలు ముగియడంతో 14వ తేది నుంచి 22 వ తేది వరకు తిరుపతి గంగమ్మజాతరను నిర్వహించారు. ప్రతి రోజూ భక్తులు, తిరుపతి వాసులు బండ, బైరాగి, తోటి, మాతంగి, దొర, సున్నపు కుండలు వేషాలతో పాటు సప్పరాలు, రకరకాల వేషధారణలతో వీధుల్లో తిరుగుతూ, అమ్మవారిని సంతృప్తి పరిచేందుకు పలు రకాల బూతులు తిడుతూ మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం జాతర రోజు అమ్మవారికి అభిషేకం చేసి, పొంగళ్లు పెట్టి, పొటేళ్లు, కోళ్లు, మేకలు, దున్నపోతులు బలి ఇచ్చారు. బుధవారం వేకువజామున అమ్మవారు విశ్వరూప దర్శనాన్ని వీక్షించేందుకు లక్షలాది మంది తరలివచ్చారు. పేరంట్రాలు రాకతో అమ్మవారి విశ్వరూపాన్ని తీసేయడంతో జాతర ముగిసింది. ఈ జాతర తీరు జిల్లా వాసులందరికీ ఎరుకే.

దీనికి ముందు నెల రోజుల పాటు ఎన్నికల జాతర జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఒక పార్లమెంట్ స్థానం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 18 లక్షల మంది ఓటర్లు ఉండగా 265 మంది అభ్యర్థులు ఎంపి, ఎంఎల్ఏ పదవుల కోసం పోటీ పడ్డారు. బూర్జువా రాజకీయ పార్టీలన్నీ ప్రతి రోజూ ప్రచారం హోరెత్తించారు. ఎపుడూ ప్రజా సమస్యలు పట్టని అభ్యర్థులు వీధిబాటపట్టారు. టీ అంగళ్లు దూరి టీ పోయడం, టిఫన్ అంగట్లో దోశలు వేయడం, కూలీలతో కలిసి బరువులు మోయడం, ఐస్‌లు అమ్మడం, కొబ్బరిబోండాలు కొట్టడం, పండ్లు అమ్మడం, బట్టలు ఉతకడం, షాపుల్లో చెప్పులు ఇతరాత్రవి విక్రయించడం. అబ్బో ఒకటేంటి రకరకాల వేశాలు వేశారు. ప్రజల ఓట్లు కోసం అనేక ప్రలోబాలకు దిగారు. ఓటుకు వేల రూపాయలు పంచారు. బెదిరించారు. బుజ్జగించారు. భయపెట్టారు. అవసరమైతే కొట్టారు. దాడులు చేశారు. ప్రత్యార్థుల ఎత్తులకు పై ఎత్తులు వేశారు. తమ తమ అంగబలం, ఆర్థిక బలాన్ని చూపించారు. అధికార యంత్రాంగాన్ని వాడుకున్నారు. వ్యవస్థలను ప్రలోభాలకు గురిచేశారు. ఇంతచేసినా ఓటర్లు ఎవ్వరు ఏ వైపు నిలబడ్డారు అనేది మాత్రం జూన్ 4న తెలుస్తుంది. గడిచిన 15రోజుల్లో జిల్లాలో రెండు జాతర్లు ముగిశాయి.

ప్రశాంతంగా ఏపీపీఎస్‌సీ పరీక్ష

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలోని ఎస్వీసెట్, వేము ఇంజనీరింగ్ కళశాలతో పాటు పలమనేరు వద్ద ఉన్న మదర్‌థెరిసా ఇంజనీరింగ్ కళశాల్లో శనివారం నిర్వహించిన ఏపిపిఎస్‌సి (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) పరీక్షకు 730మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 434 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు.

టపాకాయల గోదాము సీజ్

ప్రజాశక్తి - వెదురుకుప్పం, కార్వేటినగరం:

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాణాసంచా విక్రదారులు, పెట్రోల్ బంకు యాజమాన్యం ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని మండల తహసీల్దార్ పుష్పకుమారి అన్నారు. శనివారం మండల పరిధిలోని చింతతోపు వద్ద ఉన్న బాణాసంచా గోదామును సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నందున ప్రమాదకరమైన బాణా సంచాల విక్రయాలను జూన్ 6వ తేదీ వరకు నిలుపివేయాలని సూచించారు. పెట్రోల్ బంకు యాజమాన్యం కూడా పెట్రోల్ వినియోగదారులకు బాటిళ్లలో ఇవ్వడ కూడదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి వారిపై కేసునమోదు చేయడమే కాకుండా భారీగా జరిమాన విధించడం జరుగుతుందన్నారు. అనంతరం బాణాసంచా గోదాముకు సీల్‌వేసి మూయించారు. తహసీల్దార్ వెంట ఎస్ఐ వెంకటక్రిష్ణ, డిప్యూటీ తహసీల్దార్ నీలావతి, సర్వేయర్ సురేష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

టపాకాయలు విక్రయించరాదు: సిఐ

ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకు టపాకాయలు విక్రయించరాదని బంగారుపాళ్యం సిఐ లక్ష్మయ్య తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని టపాకాయల విక్రయ లైసెన్స్ కలిగిన వారితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు మేరకు విజయోత్సవాలు ర్యాలీలు బాణాసంచా కాల్చడం నిషేధమని వాటిని విక్రయించిన వారిపై తగినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసీపీ శ్రేణుల రౌడీయిజం సరికాదు..!

ప్రజాశక్తి - రామకుప్పం: వైసీపీ శ్రేణులు రౌడీయిజం చేయడం సరికాదని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా మసలుకోవాలని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మండలపరిధి 89పెద్దూరు గ్రామంలో శుక్రవారం టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నేతలు దాడిని తీవ్రంగా ఖండించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రశాంతంగా ఉన్న కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల్లో వైసిపి శ్రేణులు అలజడులు సష్టిస్తూ, విపక్ష శ్రేణులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం జరుగుతోందన్నారు. వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలను ఐదేళ్ల పాటు భరించిన జనం ఇటీవల జరిగిన ఎన్నికల్లో బుద్ధి వచ్చేలా తీర్పు ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నేతలు, కార్యకర్తలు గుర్తించి జాగ్రత్తగా మసలుకోవాలని హితువు పలికారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ కార్యదర్శి నరసింహులు, నారాయణాచారి, రామమూర్తి, విశ్వనాథ్, వెంకటాచలం, మహమ్మద్ రఫీ, మనోహర్, సత్తి, విజయ్‌కుమార్ రెడ్డి, గజేంద్ర, లోకేష్, ప్రకాష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

డ్వామా పీడీరాజశేఖర్

ప్రజాశక్తి- గంగవరం : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధి వేతనాలు ప్రతివారం జమవుతున్నందున వేతనదారులు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని పీడీ కోరారు. శనివారం కొత్తపల్లిలో ఉపాధి నిధులతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు కుర్నిపల్లిలో జరుగుతున్న చెరువు కాలువ పూడికతీత పని, కలగటూరులో నిర్మిస్తున్న పంట కుంటలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఉపాధి పనులు శేషుకోని వందరోజుల ఉపాధి పొందాలని కోరారు. అలాగే ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే కొత్త పనులు మంజూరు చేస్తామని ఇందులో అమత్ సరోవర్లు, మినీ అమత్ సరోవర్లు, పంట కుంటలు, పండ్ల మొక్కల పెంపకం, పూలమొక్కల పెంపకం, చెరువుకట్టల బలోపేతం తదితర పనులు మంజూరు చెయ్యడం జరుగుతుందని వేతనదారులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుంగనూరు ఏపీడీ సునీల్ కుమార్ ఏపీఓ మురుగేషన్, జేఈ కోదండపాణి, టిఏలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

పోలీస్ మాక్ డ్రిల్..?

- లాఠీ ఛార్జీ, గాలిలోకి కాల్పులు, టిష్యూ గ్యాస్
- ఇది వాస్తవమే అని పట్టణంలో పుకార్లు



ప్రజాశక్తి- పుంగనూరు: ఓట్ల లెక్కింపు అనంతరం పుంగనూరు నియోజకవర్గంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు స్థానిక గోకుల్ సర్కిల్‌లో జిల్లా ఎస్పీ విఎన్.మణికంఠ చందోల్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు పుంగనూరులో మాక్ డ్రిల్ నిర్వహించారు. గొడవలు జరిగితేఎలా ఉంటుందో అని స్థానిక ప్రజలకు అర్థమయ్యే విధంగా కళ్లకుకట్టినట్లు జనం ఎలా నష్టపోతారని చేసి చూపించారు. రాజకీయపార్టీకి చెందిన కొందరు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తారు. ఎంతచెప్పినా.. వినకపోవడంతో చివరికి పోలీసులపై తిరగబడి రాళ్ళు, విసురుతూ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తారు. పోలీసులు వెంటనే నిరసన కారులపై పొగ బాంబులు విసురుతారు. దిష్టిబొమ్మ దగ్ధం జరుగుతున్నప్పుడు అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేస్తారు. నిరసనకారులు అదుపులోకి రాకపోవడంతో పోలీసులు వెంటనే జిల్లా ఎస్పీ వద్ద అనుమతులు తీసుకుని కాల్పులు ప్రారంభిస్తారు. కాల్పుల్లో ఓ వ్యక్తికి రక్తగాయాలు అయి రోడ్డు మీదే పడిపోయి విలవిలా తణుకులాడుతాడు. పోలీసులు వెంటనే అంబులెన్స్ తీసుకొచ్చి గాయాలైన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తారు. నిరసనకారులు అదుపుతప్పి ప్రవర్తించడంతో లాఠీచార్జి నిర్వహిస్తారు. టిష్యూ గ్యాస్ ప్రయోగిస్తారు. పోలీసులు నిర్వహించిన ఈ దశ్యాలను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. గోకుల్ సర్కుల్లో పోలీసులు మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తుంటే పట్టణంలో మాత్రం గొడవలు జరుగుతున్నాయని పోలీసులు కాల్పులు జరుపుతున్నారని పుకార్లు అల్లుకున్నాయి.

ప్రజల అవగాహన కోసమే మాక్ డ్రిల్: ఎస్పీ

క్షణికావేశంలో గొడవలు పడితే జరిగే నష్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కోసమే మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ విఎన్.మణికంఠ చందోల్ తెలిపారు. స్థానిక గోకుల్ సర్కిల్ మాక్ డ్రిల్ అనంతరం శనివారం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. జూన్ 4న ఓట్లు లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని అనంతరం ఏపార్టీ వారైనా గొడవలకు ప్రోత్సహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు ముందస్తుగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా పోలీసులు ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎవరు ఎలాంటి కవ్వింపు చర్యలు చేపట్టిన వారిపై కఠినచర్యలు ఉంటాయన్నారు. ఓట్లు లెక్కింపు అనంతరం వరకు కూడా 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గుంపులు గుంపులుగా మాట్లాడడం గొడవలకు దిగడం లాంటి చర్యలు చేపట్టకూడదన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, పలమనేర్ ఇన్‌ఛార్జి డిఎస్పి విష్ణు రఘువీర్, సిఐ రాఘవరెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మండలంలోని తయ్యూరు పాయకట్టు అంకనపల్లె ధర్మరాజులు దేవస్థానం వద్ద ఆర్వీఎస్ చిత్తూరు ఆసుపత్రి వారు శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అపూర్వ స్పందన లభించింది. డాక్టర్ ఖలీద్, డాక్టర్ భవిత ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన రోగులకు వైద్యసేవలు అందించారు. దాదాపు 100 మందికి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. సాధారణ వైద్యపరీక్షలు, ఆర్థో, గైనకాలజీ లాంటి జబ్బులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని గుర్తించి తమ ఆసుపత్రిలో చేరాలని సూచించారు. వీరికి ఉచిత బస్సుతోపాటు వైద్యసేవలు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మాలతి, జ్యోతిక, సుబ్రమణ్యం, గోవిందస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో కంటి పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ ఖలీద్

భగత్ సింగ్ కాలనీలో నాకాబందీ

- అనుమానాస్పద ఇండ్లలో తనిఖీలు
- రికార్డు లేని ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీ పరిధి భగత్‌సింగ్ కాలనీలో పోలీసులు నాకా బందీ నిర్వహించి రికార్డులు లేని ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రాఘవరెడ్డి తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అర్బన్ సీఐ ఆధ్వర్యంలో శనివారం నాకా బందీ నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులున్న పలు ఇళ్ళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాఘవరెడ్డి మాట్లాడుతూ అర్బన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎక్కడ గొడవలు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు, అనుమానాస్పద ఇండ్లను తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా భగత్‌సింగ్ కాలనీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, నాకా బందీ చేపట్టడం జరిగిందన్నారు. కాలనీలో అనుమానస్పద వ్యక్తుల ఇండ్లలో తనిఖీలు చేపట్టి మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా వస్తువులు గురించి, వాహనాలను తనిఖీలు చేసి, సరైన రికార్డ్స్ లేని 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే కొత్తగా సవరించిన మోటార్ వెహికల్ చట్టంలోని పెంచిన జరిమానాల గురించి తెలియజేస్తూ, వార్డు, కాలనీలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ఆ తర్వాత కాలనీ వాసులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకూడదని హెచ్చరిస్తూ, ఎన్నికల నియమావళి, సెక్షన్ 144 సిఆర్‌పిసి అమలులో ఉన్నదని, నియమావళిని పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారెడ్డి, మహమ్మద్ రఫీ, 20మంది సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ..!

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరు వర్గాలు

ప్రజాశక్తి - రామకుప్పం

89 పెద్దూరు గ్రామంలో శుక్రవారం రాత్రి టిడిపి నేతలపై, వైసీపీ నేతలు దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని రామకుప్పం ఎస్ఐ శివకుమార్ తెలిపారు. 89 పెద్దూరు గ్రామానికి చెందిన టీడిపి కార్యకర్త శేషాద్రి శుక్రవారం రాత్రి తమ పొలంలో అడవి పందులు తరిమేందుకు బయలుదేరాడు. మధ్యమార్గంలో తన స్నేహితుడు శ్రీను, వెంకటేష్ కూడా తన పొలం వద్దకు తీసుకెళ్లి అడవి పందులు వస్తున్నాయని, వాటి నివారణకు చర్చించుకుంటున్నారు. అదే సమయంలో వైసిపికి చెందిన మణి కుమార్ తన పొలం వద్దకు వచ్చాడు. ఇక్కడున్న శేషాద్రి, శ్రీను, వెంకటేష్‌లను గమనించి మా పొలం వద్ద మీకేం పని అని అడిగాడు... మా పొలంలో విద్యుత్ తీగలను అమర్చటానికి వచ్చారా, మాపై బాంబులు వేయడానికి వచ్చారా.. అంటూ వారితో ఘర్షణ పడ్డారు. కొద్దిసేపటికి మణికుమార్ తన సోదరులు గోపినాథ్, శివకుమార్, మురుగేష్‌తో కలిసి శేషాద్రి, శీను, వెంకటేశులపై దాడి చేశారు. ఈ ఘటనలో అపస్మారకస్థితికి చేరుకున్న శేషాద్రిని స్థానికులు, కుటుంబీకులు 108 ద్వారా కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -సదుం:





మండల పరిధిలోని చెరుకువారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎలిశెట్టివారిపల్లికి చెందిన మహేష్, దేవా అనే ఇద్దరు యువకులు 23వ తేదీ గురువారం రాత్రి పొలం వద్ద విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు ఎలిశెట్టిపల్లికి చెందిన ఎలిశెట్టి దేవేంద్రా కుమారుడు మహేష్ (26), కావలి రవి కుమారుడు దేవా (22)అనే ఇద్దరు యువకులు గత 23వ తేదీ రాత్రి సుమారుగా 10గంటల ప్రాంతంలో వారి పొలం వద్దకు జయప్రకాశ్ మామిడి తోట మీదుగా వెళ్తుండగా దగ్గర్లోని విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ దగ్గర నేలమీద పడి వున్న విద్యుత్ వైర్లకు ఇద్దరు యువకులు తగులుకొని కింద పడిపోయారు. యువకుల పెనుగులాటలో విద్యుత్ వైర్లు కనెక్షన్ తెగిపోవడంతో ఇద్దరు యువకులు ప్రాణపాయం నుండీ బయట పడ్డారు. తీవ్రంగా గాయపడిన యువకులు సదుం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అక్కడి నుంచి 24వ తేదీ శుక్రవారం పీలేరు ప్రభుత్వశాలకు, అక్కడ నుండీ తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా యువకుల పరిస్థితి మెరుగపడకపోవడంతో మహేష్‌ను తిరుపతిలోని నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు, దేవాను మెడికో హాస్పిటల్‌లో చేర్పించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎవరో గుర్తుతెలీని వ్యక్తులు అడవి పందులకు విద్యుత్ వైర్లు తీసినట్లు బాధిత కుటుంబ సభ్యులు సదుం పోలీసులకు తెలిపి ఫిర్యాదు చేశారు.

నాటు సారా స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- సోమల

మండలంలోని వల్లిగట్ల పంచాయతీ అగ్రహారం వడ్డిపల్లికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి నాటుసారా అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై వెంకట నరసింహులు, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పోలీసులను చూసి నిందితుడు పారిపోవడానికి ప్రయత్నం చేశాడని అతన్ని వెంబడించి అతని వద్ద ఉన్న మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



ప్రజాశక్తి- వి.కోట : మండల పరిధిలోని బోడిగుట్టపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో రికార్డులులేని 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు. చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్‌ను దష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక గ్రామాలను సందర్శిస్తున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా వి.కోట అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ లింగప్ప, బైరెడ్డిపల్లి ఎస్ఐ క్రిష్ణయ్య 20 మంది పోలీస్ సిబ్బందితో కలిసి వి.కోట మండలం, బోడిగుట్టపల్లి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్‌ను తెల్లవారు జామున నిర్వహించారు. ఇందులో అనుమానితుల ఇళ్ళను, తనిఖీ చేసి, రికార్డులులేని మొత్తం 27 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోగా, అందులో 9 ద్విచక్ర వాహనాలకు రికార్డులు ఉన్నందున వాటిని పరిశీలించి అక్కడికక్కడే పంపడం జరిగిందన్నారు. మిగిలిన 18 ద్విచక్రవాహన యజమానులు రికార్డులు చూపనందుకు ఆ ద్విచక్ర వాహనాలను వి.కోట అర్బన్ పోలీసు స్టేషన్‌కు తీసుకొని రావడం జరిగిందన్నారు. ఈ వాహనాలకు కూడా సరైన రికార్డులు చూపించి ద్విచక్ర వాహన యజమానులు తీసుకెళ్లవచ్చు అని తెలిపారు.

సీనియర్ టిడిపి నేత మృతి

ప్రజాశక్తి- గంగవరం: పలమనేరు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసి శ్రీ వాణి అండ్ మధు కళాశాలల యజమాని సిపి.బాలసుందరం రెడ్డి శనివారం ఉదయం వేలూరు సిఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారి కుటుంబీకులు తెలిపారు. శనివారం సాయంత్రం 3గంలకు శ్రీ వాణి కళాశాల ప్రాంగణంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచి, ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

సైబర్ బాధితునికి నగదు రిఫండ్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు అందిన కేవలం 20 నిమిషాల్లోనే స్పందించి రూ.1,42,545 లను బాధితునికి రీఫండ్ చేయించి న్యాయం చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సైబర్ పోలీసుల కథనం మేరకు... తిరుపతి లో కాపురముంటున్న రాజు తిరుమల లో విధులు నిర్వర్తిస్తున్నారు. 24వ తేది ఉదయం 11 గంటల ప్రాంతంలో 'ఇండసింది కస్టమర్ కేర్ నుండి ఫోన్ చేస్తున్నాము... మీరు కెవైసి అప్‌డేట్ చేసుకోవాలి, లేకపోతే మీ క్రెడిట్ కార్డు ఎక్స్‌పైర్డ్ అవుతుంది' అని చెప్పి, మీకు వచ్చిన ఓటీపీని చెప్పమన్నారు. అది నమ్మి అతను వెంటనే ఆలస్యం చేయకుండా ఓటీపీ చెప్పడంతో అతని క్రెడిట్ కార్డు నుండి రూ. 1,42,545 డెబిట్ అయ్యింది. అతను దిక్కుతోచని పరిస్థితులలో పోలీస్ గ్రౌండ్‌లో ఉన్న సైబర్ క్రైమ్ ఆఫీస్ కి వచ్చి జరిగిన విషయం అంతటిని సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్‌కు వివరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశం మేరకు వెంటనే సైబర్ క్రైమ్ టీంను, అప్రమత్తం చేసి వెంటనే ఎన్ సిఆర్ పిలో కంప్లైంట్ రైజ్ చేసి, హౌసింగ్ .కామ్ నోడల్ ఆఫీస్ కి నోటీసును, మెయిల్ ద్వార సర్వ్ చేసి పర్సనల్ గా సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ఫోన్లో సంబంధించిన నోడల్ ఆఫీసర్స్ తో మాట్లాడి ఫ్రాడస్టర్ బుక్ చేసిన ఆర్డర్స్ అన్ని కాన్సిల్ చేసి బాధితుని క్రెడిట్ కార్డుకి రూ. 1,42,545/- అమౌంట్ ను 20 నిముషాల లోపల రిఫండ్ అయ్యేలా చేసి న్యాయం చేశారు. ఈ కేసును 20 నిమిషాల పరిష్కరించిన క్రైమ్స్ బందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

సంక్షిప్త వార్తలు

శ్రీకాళహస్తిలో కోడ్ ఉల్లం'ఘనులు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సాధారణ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం, అధికారులు కోడ్ ఉల్లంఘనలపై నిఘా పెట్టారు. కేసులు కూడా నమోదు అవుతున్నాయి. అయితే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో మాత్రం ప్రతిరోజూ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. ఆలయ ఇఓగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఉన్నారు. సుదీర్ఘకాలం రెవెన్యూలో పనిచేశారు. ఎన్నికల నిర్వహణ కార్యక్రమాలు చేపట్టిన అనుభవం కూడా ఉంది. ఎన్నికల కోడ్ గురించి ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. అయినా ఉల్లంఘన కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో నాయకులు పాల్గొనకూడదు. నాయకులతో కలిసి ఇఓ కూడా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బోర్డు కార్యాలయానికి రావడం, అధికారులు, సిబ్బందితో చర్చించడం, పనులు పరిశీలించడం, ప్రారంభోత్సవాలు చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందా లేదా అనేది ఎన్నికల అధికారులు తేల్చాల్సి ఉంది. రిటర్నింగ్ అధికారైన ఆర్డీవో స్థానికంగానే ఉన్నారు. ప్రతిరోజు పత్రికల్లో, టీవీల్లో నాయకులు పాల్గొన్న కార్యక్రమాలు వస్తూనే ఉన్నాయి. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇది కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందా లేదా అనేది రిటర్నింగ్ అధికారి స్పష్టం చేయాల్సి ఉంది.

అన్నదానం



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవం పురస్కరించుకుని శనివారం అన్నదాన కార్యక్రమం బంగారుపాళ్యం మండలంలోని బొమ్మాయిపల్లిలో నిర్వహించడం జరిగిందని ఆలయ నిర్వహకులు పట్టాభి మునిస్వామి, నారాయణ, గంగాధరం సుబ్రహ్మణ్యం, ప్రభావతి తెలిపారు. ఉదయం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా పూజ కార్యక్రమాలు చేసి అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేపట్టారు. మాజీ సర్పంచ్ నీరజాక్షులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: మండలంలోని తిమ్మాజిపల్లి సచివాలయంలో శనివారం వేరుశనగ విత్తనాలను పంపిణీ చేపడుతున్నట్ల సర్పంచ్ రేఖ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రాయితీతో వేరుశనగ విత్తనాలు అందిస్తున్నారని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి వాణి, సల్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విగ్రహాల ప్రతిష్ట

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: మున్సిపల్ పరిధి కీళపట్టు చిదంబరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నూతన విగ్రహాల ప్రతిష్ట చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం తెలిపారు. శ్రీవోందేవి, ప్రత్యంగర శరభేశ్వరర్, వరాహి దేవతలను ప్రతిష్టించనున్నామని తెలిపారు. ఆ దేవత విగ్రహం తొలిసారిగా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించనున్నామని అన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎన్నికల కోడ్ నేపథ్యంలో శనివారం ఎంపీపీ అనిత అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ఈసందర్భంగా సమస్యలను రాతపూర్వకంగా అందించాలని ఎంపీడీవో సభ్యులను కోరారు. జడ్పీటిసి సభ్యురాలు లక్ష్మీప్రియ, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ, అధికారులు పాల్గొన్నారు.

27 నుంచి గంగమ్మ జాతర

ఆలయ ధర్మకర్త రాధమ్మ కష్ణప్ప

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: మండలంలోని బొమ్మాయిపల్లి పంచాయతీ వజ్రాలపుర బోయకొండ గంగమ్మ జాతర ఈనెల 27వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్త రాధమ్మ కష్ణప్పలు తెలిపారు. శనివారం ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 27న జాతర అంకురార్పణ, 28న అంబల్లు, పొంగళ్ళు, 29న అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోవాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పురుషోత్తం గౌడ, గోపి గౌడ, నాగరాజు గౌడ్, మురళి గౌడ్, శంకర్ గౌడ, రామ్మూర్తి నాయుడు, రామచంద్ర నాయుడు, మొగిలిప్ప తదితరులు పాల్గొన్నారు

హర్షవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం పరిశోధక విద్యార్థి కె.హర్షవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగం ఆచార్యులు డా. డి.గౌరీ శంకర్ రెడ్డి మార్గదర్శకత్వంలో 'అనాలసిస్ ఆఫ్ మోడిఫైడ్ వాటర్ ఇండిసెస్ ఫర్ సర్ఫేస్ వాటర్ డిటెక్షన్ ఇన్ ల్యాండ్ సాట్ – 8 ఇమేజరీ' అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. హర్షవర్ధన్ రెడ్డికి డాక్టరేట్ డిగ్రీ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయవాది ఈశ్వరయ్యను పరామర్శించిన 'ఆరణి '

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: నాలుగు రోజుల కిందట రేణిగుంట రోడ్డులోని హోండా షో రూం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో న్యాయవాది ఈశ్వరయ్య ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఈశ్వరయ్యకు తీవ్ర గాయాల పాలవడంతో నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం ఈశ్వరయ్యను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈశ్వరయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు దినకర్ , కంచి ప్రవీణ్ కుమార్, లగిశెట్టి వెంకటరమణ, గాలి శ్రీనివాసులు, అప్పిలి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వమే : చింతామోహన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రంలో, కేంద్రంలో వైసిపి , బిజెపి పార్టీలకు అనుకూల పరిస్థితులు లేవని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ తిరుపతి ఎంపి అభ్యర్థి చింతామోహన్ అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద తిరుపతి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ఓటర్లను అనేక విధాలుగా ప్రభావితం చేశారని, అయితే విజ్ఞతతో ఓటర్లు ఓటు వేశారని పేర్కొన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, వెంటనే దుగరాజపట్నం పోర్టు నిర్మాణం పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో డాక్టర్ రామకష్ణారావు, పూల చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'సాంసంగ్ సాల్వ్ ఫర్ టుమారో' తెలుగు విద్యార్థులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సాంసంగ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాదులోని మహాత్మా గాంధీ ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ లో ఇంజనీరింగ్ విద్యార్థులచే సాంసంగ్ సాల్వ్ ఫర్ టుమారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విద్యార్థులు హాజరై తమ ప్రతిభ పాటవాలను చాటారు. ఈ కార్యక్రమానికి టెక్నాలజీ ఔత్సాహితుడు రాబిన్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాంసంగ్ సాల్వ్ ఫర్ టుమారో అనే కార్యక్రమం జాతీయ విద్య, ఆవిష్కరణల పోటీకి సంబంధించినది. ఇది దేశంలోనే తరవాత తరాలను వినూత్న ఆలోచనలతో, సమస్య పరిష్కారానికి సంబంధించిన లక్ష్యంతో ఏర్పాటు చేసింది. ఇందులో తెలుగు విద్యార్థులు ముందుకు వచ్చి డ్రోన్ టెక్నాలజీ ద్వారా సముద్ర సంరక్షణ, వ్యర్థాల నివారణ వంటి వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి, తమ నిబద్ధతను వ్యక్తం చేశారు. తమ ఆలోచనలు కార్యరూపం దాల్చడంలో మార్గ నిర్దేశం చేయగల, మద్దతు ఇవ్వగల, ప్రజా జీవితాలను మార్చడంలో సాయపడే సాంసంగ్ సాల్వో ఫర్ టుమారో కార్యక్రమం ఓ వేదిక లాంటిది అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను యువత సభ్యులుగా చేసుకొని మరింత ముందుకెళ్లాలని కోరారు.

'కౌటిల్య' విద్యార్థులకు ఐఐఎం అడ్మిషన్స్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి ఎంఆర్‌పల్లి సర్కిల్ వద్ద వున్న 'కౌటిల్య ఇన్స్టిట్యూషన్' సంస్థ కి చెందిన 8 మంది క్యాట్ విద్యార్థులకు ఈ వారం లో విడుదల చేసిన తుది ఫలితాలలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అత్యంత ప్రతిష్టాత్మక కాలేజీ లు – ఐ.ఐ.ఎం లలో, మరో 10 మందికి పైగా విద్యార్థులకు ఇండియా లోని టాప్ బిజినెస్ స్కూల్స్‌లో అడ్మిషన్ సాధించారు. శ్రీధర్ మాట్లడుతూ 'ముందున్నవాళ్లకు ముందే అవకాశాలు దొరుకుతాయి ' అనే సామెత ఈ క్యాట్ లో చాలా బాగా పని చేస్తుంది. అంటే విద్యార్థులు తమ డిగ్రీ / లేదా బి.టెక్ చదువుతున్నప్పుడే తమ ఖాళీ సమయాన్ని ఈ ఐ.ఐ.ఎమ్ లో అడ్మిషన్ కోసం ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ఉచిత గైడెన్స్‌కు కౌటిల్య సంస్థను 9698123456 కి ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు.